# 8. పశ్చాత్తాపం

హజ్రత్ అబూ హురైర (రజిఅన్) ఉల్లేఖించారు - మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రబోధించారు : "ఏ దాసుడైనా అపరాధం చేసి 'నా ప్రభూ! నా వల్ల అపరాధం జరిగిపోయింది. నన్ను క్షమించు' అని వేడుకుంటే అతని ప్రభువు ఇలా అంటాడు- 'తన తప్పులను మన్నించి, తనను రక్షించగల ప్రభువు ఉన్నాడన్న సంగతి నా దాసునికి తెలుసా? అయితే నేను నా దాసుడ్ని క్షమించివేశాను.' ఇక అల్లాహ్ కోరినంత వరకు అతను అపరాధాకు దూరంగా ఉంటాడు. మళ్ళీ అపరాధంచేసిమళ్ళీ అడుగుతాడు; 'ఓ నా ప్రభూ! నా వల్ల మరొక తప్పు జరిగిపోయింది. దీన్ని కూడా క్షమించేయి' అప్పుడు అల్లాహ్, 'తన తప్పులను మన్నించి, తనను కాపాడగల ప్రభువు ఉన్నాడని నా దాసుడు తెలుసుకున్నాడా? అయితే నేను నా దాసుడ్ని మన్నించాను' అని అంటాడు. ఇక ఆ దాసుడు అల్లాహ్ తలచినంతవరకు అపరాధాల బారినుండి సురక్షితంగా ఉంటాడు. మళ్ళీ అపరాధానికి ఒడిగట్టి తిరిగి ప్రార్థిస్తాడు ; 'నా స్వామీ! నా వల్ల ఒక తప్పు జరిగిపోయింది. నన్ను క్షమించి వదిలెయ్యి.' అల్లాహ్ తిరిగి అంటాడు - 'తన తప్పులను మన్నించి తనకు రక్షణ కల్పించే ప్రభువు ఉన్నాడన్న యధార్థాన్ని నా దాసుడు గ్రహించాడా?! అయితే నేను నా దాసుడ్ని క్షమించివేశాను. నేను నా దాసుడ్ని క్షమించి వేశాను. అతను తాను తలచింది చేయగలడు." (బుఖారి).

ఈ హదీసులో పశ్చాత్తాపం (తౌబా) ప్రాముఖ్యత, దాని ఘనత వివరించబడింది. దాసుడు తప్పును ఒప్పుకుని తన వైపునకు మరలడాన్ని అపరాధాల మన్నింపునకై తనను ప్రార్థించటాన్ని విశ్వప్రభువు ఎంతగానో ఇష్టపడతాడు. ఆయన క్షమాగుణానికి అంతే లేదు. ఖుర్తబి ఏమంటున్నారంటే, ఈ హదీసు క్షమాభిక్ష ద్వారా పొందే ప్రయోజనానికి అనంతమైన దైవకారుణ్యానికి, విస్తారమైన ఆయన అనుగ్రహాలకు, ఆయన గొప్పదనానికి ప్రతీకగా నిలిచింది. క్షమాభిక్ష భావం అనేది మనసులో కలిగి నోటిద్వారా గనక వ్యక్తమయితే పాపాల నుండి తప్పక విముక్తి లభిస్తుంది. మనసులో గనక పశ్చాత్తాప భావం ఏర్పడితే అది అతని ముఖ కవళికలపై అతని మాటలపై కూడా ప్రభావం వేస్తుంది. అతని మాటల్లోనే లజ్జా భావం వ్యక్తమవుతుంది.

అటువంటి వక్తి తన చేత ఎప్పుడు అపరాధం జరిగిపోయినా పశ్చాత్తాపాన్ని ఆశ్రయిస్తాడు. అయితే ఒక వ్యక్తి పొద్దస్తమానం "అస్తగ్ఫిరుల్లాహ్, అస్తగ్ఫిరుల్లాహ్" అంటూనే పాపాలు మామూలుగా చేస్తూపోతే మాత్రం అతను పశ్చాత్తాపం గ్రహించలేదనుకోవాలి. అటువంటి నోటితో పశ్చాత్తాపం ప్రకటించినా అది వ్యర్థమే.

https://teluguislam.net

ఇబ్నె అబీ అద్దీనా గారు అబ్దుల్లా బిన్ అబ్బాస్ ద్వారా ఉటంకించారు : అపరాధాల పట్ల పశ్చాత్తాపం చెందినవాడు అపరాధం చేయనట్లే లెక్క. అయితే నిత్యం అపరాధాలు చేస్తూ కూడా ప్రభువు ముందు క్షమాభిక్ష కోరేవాడు ప్రభువుతో పరిహాసమాడా డన్నమాట."

ఖుర్తబి అభిప్రాయం ఇలా ఉంది : "ఈ హదీసు ద్వారా వ్యక్తమయ్యే ఒక కోణం ఏమంటే, రెండవసారి చెడుకు పాల్పడితే అది మొదటి అపరాధం కన్నా ఎక్కువ పాతకం అవుతుంది. ఎందుకంటే ఈసారి మొదటి పశ్చాత్తాపం కూడా భంగమైపోయింది. అయితే రెండవసారి చెందిన పశ్చాత్తాపం కూడా చాలా మంచిదే. ఎందుచేతనంటే అతను కారుణ్య ప్రభువును మాటిమాటికీ క్షమ కోసం దరఖాస్తు చేసుకుంటున్నాడు. అంతేకాదు, తనచేత ఘోరం జరిగిపోయిందని ఒప్పేసుకుం టున్నాడు. తనుచేసిన తప్పును 'నువ్వు తప్ప మరొకడు క్షమించడు' అని కూడా అంగీకరిస్తున్నాడు.

ఈ హదీసు వివరణలో నవవి ఇలా వ్రాశారు : "పాపం అన్నది ఒకసారి జరిగినా, వెయ్యిసార్లు జరిగినా, లేదా అంతకంటే ఎక్కువసార్లు జరిగినా ప్రతిసారి పశ్చాత్తాపం చెందాలి. లేదా చివరిలోనయినా పశ్చాత్తాపం మనస్ఫూర్తిగా చెందితే అది నిజమవుతుంది."

పశ్చాత్తాపం స్వీకరించబడటానికి నాలుగు షరతులున్నాయని ఉలమాలు (ఇస్లామీయ పండితులు అంటారు) -(1) పాపపు పనులను పూర్తిగా విడనాడాలి. (2) గతంలో జరిగిపోయిన పాతకాలపై మనిషి సిగ్గుపడాలి. (3) ఇకపై వాటిని చేయబోమని ధృఢ సంకల్పం చేసుకోవాలి. (4) పాపాల వైపునకు గొనిపోయే విషయాలు, వస్తువులతో పూర్తిగా సంబంధం త్రెంచుకోవాలి. ఒకవేళ ఆ వస్తువులు సాటి మనుషులకు సంబంధించినవైతే వారికి వారి హక్కును ఇచ్చివేయాలి. లేనిపక్షంలో వారిని క్షమాపణ కోరుకోవాలి.

పశ్చాత్తాపంతో, సిగ్గుతో కుమిలిపోవటమన్నదే ప్రధాన విషయం అని కొందరు ఉలమాలు అంటారు. ఎందుకంటే మనిషి సిగ్గుతో కుంచించుకుపోయినపుడే మళ్ళీ ఆ పాపం జోలికి పోకుండా ఉంటాడు.

"సిగ్గుతో కృంగిపోవడమే పశ్చాత్తాపం"

**(ఇబ్నుమాజ, సహీహ్ హాకిమ్)**

క్షమించమని తనను ప్రాధేయపడే వారంటే అల్లాహ్‌కు అమితమైన వాత్సల్యం, అందుకే "నా దాసుడు" అని మనిషిని ప్రస్తావించాడు. 'అతన్ని క్షమించాను పో' అని శుభ వర్తమానం ఇచ్చాడు.

https://teluguislam.net

"అల్లాహ్ రక్షించినంత కాలం అతను పాపాలకు దూరంగా ఉంటాడు" అనే దాని భావం ఏమంటే మనిషి అనునిత్యం పాపం చేయడు. మానవ సహజమైన బలహీనత కారణంగా ఎప్పుడో ఓసారి అతనిచేత పొరపాటు జరిగిపోతుంది. మరి కొంతకాలం గడచిన తరువాత మరో ఘోరం జరుగుతుంది. వీలయినంతవరకు అటువంటి ఘోరాలకు దూరంగా, జాగ్రత్తగా మసలుకోవటమే ధర్మ పరాయణతకు, దైవభీతికి నిదర్శనం. అలాకాకుండా అడ్డూ అయిపూ లేకుండా, నిర్భయంగా పాపాలు చేస్తూ ఏదో మొక్కుబడిగా పశ్చాత్తాపం పలికినవాడు పశ్చాత్తాపం యొక్క సారాన్ని అర్థమే చేసుకోలేదని అనుకోవాలి. పైపెచ్చు గౌరవోన్నత ప్రభువుతో అతను పరాచికాలాడుతున్నాడన్నమాట.

"నేను నా దాసుణ్ని క్షమించివేశాను" అనేది హదీసులోని వాక్యం. దాసుడు గనక తన ప్రభువు యొక్క కారుణ్య కడలి వద్ద నిలబడి మొరపెట్టుకుంటే అది ఉప్పొంగుతుంది. ఎన్నోసార్లు దాసుని పాపాలు క్షాళనం అయినట్లు ప్రకటించబడుతుంది. అదే ఆ పరమాత్ముని గొప్పదనం. అందుకే దాసుడు తన వల్ల జరిగే పొరబాట్లు, పొరపొచ్చాల పట్ల నిరాశకు, అసంతృప్తికి తావీయకుండా ఆయన వైపునకు మరలాలి. క్షమించటమే తన గొప్పదనం అనుకునే ప్రభువును క్షమాభిక్ష కోరాలి.

"అతను తలచింది చేసుకోవచ్చు"

ఆదం కుమారుడు బలహీనతలకు ప్రతిరూపం. తనవల్ల ఘోరం జరిగిపోయినపుడు అతను ప్రభువును వేడుకుంటే అది పరిహరించబడుతుంది. ఇంకా దాని బారినుండి అతను పరిరక్షించబడతాడు.

మొత్తమ్మీద ఈ హదీసు ద్వారా తేలిందేమిటంటే మనిషి ద్వారా పాపాలు జరుగుతాయి. జరుగుతుంటాయి. అయితే ఒకసారి పాపం జరిగిపోయిన తరువాత మలిసారి దాని వాతన పడకుండా తనను కాపాడుకుంటూ, అప్రమత్తంగా ఉండేవాడే, ఎప్పుడయినా ఏదయినా పొరపాటు జరిగిపోయినపుడు సిగ్గుతో, దైవభీతితో కంపించేవాడే, తన ప్రభువు ముందుకు వచ్చి మన్నింపును కోరేవాడే ఉత్తముడు.

https://teluguislam.net